క్లుప్తంగా

సన్మానం



జనగామ రూరల్: జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడిగా ఇటీవల ఎన్ ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అభిగౌడ్ నియమితులయ్యారు. కాగా, బుధవారం ఆయన కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజా మహేంద్ర నాయక్, సీఐ దామోదర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను అభిగౌడ్ శాలువాతో సన్మానించారు.

ఆర్థికసాయం



లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన పలువురు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాలను బుధవారం మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి పరామర్శించి రూ.15వేల సాయం అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ ప్యాట ముత్తయ్య, గాదరి దుర్గాప్రసాద్, ఏదునూరి రమేశ్‌లు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శివకుమార్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, దేవస్థాన చైర్మన్ మూర్తి, మార్కెట్ డైరెక్టర్లు మోహన్, శ్రీలతారెడ్డి, మాజీ ఎంపీటీసీ భిక్షపతి, నాయకులు ఉన్నారు.

ఫతేపూర్‌లో..

చిల్పూరు: ఫతేపూర్ గ్రామానికి చెందిన గుగులోత్ శంకర్ నాయక్ ఇల్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. కాగా, విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు బుధవారం ఆయనను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఊరడి రాజు, నాయకులు ఉన్నారు. అనంతరం సర్వాయి పాపన్న వర్ధంతిని బాల్నె శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఫ్లెక్సీలు చింపివేయడం సమంజసం కాదు

లింగాలఘణపురం: గుడ్‌ఫ్రైడే, రంజాన్‌పండుగల సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బుధవారం కొందరు కాంగ్రెస్ నాయకులు చింపివేయడం సమంజసం కాదని నెల్లుట్ల గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు ఖండించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే గ్రామానికి వస్తున్నాడని, వేరే పార్టీల ఫ్లెక్సీలు చింపి వేయడమేంటని, అందులో ఎవరికి వ్యతిరేకంగా, ఇబ్బందికరంగా లేవని, అలాంటప్పుడు ఫ్లెక్సీలు చింపివేయడం సిగ్గుచేటని నాయకులు సుధీర్‌రెడ్డి, నల్ల మైసయ్య, వంగ సతీష్, స్వామి, లింగమూర్తి, అశోక్, రామచందర్, నరేశ్, ఆజాం, రియాజ్, అక్బర్, ఇమ్రాన్ తదితరులు ఖండించారు.

గ్రూప్-1లో గీతకు 121వ ర్యాంకు



జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు గ్రామానికి చెందిన కొడారి గీతా గ్రూప్-1 పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయిలో 121వ ర్యాంకు సాధించింది. గ్రామానికి చెందిన కొడారి కనకయ్య రజిత దంపతుల చిన్న కుమార్తె గీత ప్రాథమిక విద్య స్టేషన్‌ఘన్‌పూర్‌లో సాయిశివాణి, ఒయాసిస్ పాఠశాలలో 4వ తరగతి నుంచి 10వ తరగతి, హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ మహిళా కళాశాలలో డిగ్రీ, ఢిల్లీలోని జవహర్‌లాల్‌నెహ్రూ యూనివర్సిటీలో రాజనీతిశాస్త్రంలో ఎంఏ పూర్తి చేసింది. అనంతరం గ్రూప్- 1 ఉద్యోగానికి దరఖాస్తు చేసి ఎలాంటి కోచింగ్ లేకుండానే 484 మార్కులతో రాష్ట్ర స్థాయి 121 ర్యాంక్ సాధించింది. కాగా, కనకయ్య- రజిత దంపతులు వ్యవసాయం చేసుకుంటూ తమ ఇద్దరు ఆడపిల్లలకు ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమార్తె శ్రీవిద్య ఇటీవల గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికై మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తోంది. రెండో కుమార్తె గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు 'జన్‌మన్‌రేగ' యాప్

- ఫోన్‌లోనే అన్ని వివరాలు అందుబాటులో
- కూలీలకు కరువైన అవగాహన



గుమ్మడవెల్లిలో ఉపాధి కూలీలు (ఫైల్)

లింగాలఘణపురం: ఉపాధి కూలీల కోసం ప్రత్యేకంగా జన్‌మన్‌రేగ యాప్ అందుబాటులోనికి వచ్చింది. దీంతో కూలీలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆ యాప్‌లోనే చూసుకునే అవకాశం ఉంటుంది. ఇంత ఉపయోగకరంగా ఉన్న యాప్‌పై కూలీలకు అవగాహన కరువైంది. ఈ యాప్ గత ఏడాది నుంచి అందుబాటులో ఉన్నప్పటికీ ఏ ఒక్క కూలీ కూడా ఉపయోగించిన దాఖలాలు లేవు.

యాప్‌తో ఉపయోగాలివి..

ఉపాధి కూలీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జన్‌మన్‌రేగ యాప్‌తో కూలీలు ఎవరి చుట్టూ తిరుగాల్సిన అవసరం లేదు. ఆన్‌డ్రాయిడ్ ఫోన్ కలిగిన ప్రతి కూలీ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న అనంతరం పూర్తి వివరాలను జాబ్ కార్డు నంబర్, మస్టర్ నంబర్‌ను అప్‌లై చేస్తే కుటుంబంలో ఎంత మంది ఉపాధి కూలీ పనులకు వెళ్తున్నారు. ఏ రైతు భూమిలో పని చేశారు. ఎన్ని రోజుల పని దినాలు చేశారు. ఎంత అమౌంట్ పడింది. ఏ బ్యాంక్‌లో ఎప్పుడు పడింది... అనే పూర్తి వివరాలు అందులో ఉంటాయి. పని ప్రదేశానికి ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లి అప్‌లోడ్ చేసిన వెంటనే ఆ రోజు ఎంత పని చేశారు. ఎంత కూలి గిట్టుబాటు అయ్యిందనే వివరాలన్నీ ఉంటాయి. ఫోన్‌లో చూసుకుని సదరు బ్యాంకు, పోస్టాఫీసుకు వెళ్లి నేరుగా డబ్బులు తీసుకునే అవకాశం ఉంటుంది. ఫీల్డ్ అసిస్టెంట్ల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగాల్సిన అవసరం లేకుండా యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇంతటి ఉపయుక్తకరమైన యాప్‌పై కూలీలకు అవగాహన లేకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు ఉపాధి కూలీలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం..



జన్‌మన్‌రేగ యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. దీంతో కూలీలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. వాళ్ల చుట్టూ వీళ్ల చుట్టూ బ్యాంకుల చుట్టూ తిరుగాల్సిన అవసరం లేదు. యాప్‌లో చూసుకుని డబ్బులు బ్యాంకులో పడ్డాయని తెలుసుకుని డ్రా చేసుకోవచ్చు.

- జలేందర్‌రెడ్డి, ఎంపీడీఓ, లింగాలఘణపురం

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఏసీపీ పండేరి చేతన్ నితిన్



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ చేతన్ నితిన్

నర్మెట: విధుల్లో అప్రమత్తంగా ఉంటూ సిబ్బంది బాధ్యతగా మెలగాలని ఏసీపీ పండేరి చేతన్ నితిన్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా స్టేషన్ పరిసరాలను, సీడీ ఫైల్స్, రికార్డులను పరిశీలించి సీఐ ముసుకు అబ్బయ్య, ఎస్సై నైనాల నగేష్‌లకు పలు సూచనలు చేశారు. రౌడీ షీటర్లను, అనుమానితులను, మాదక ద్రవ్యాల క్రయ, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని విజిబుల్ పోలిసింగ్ నిర్వహించాలని ఆస్తి నేరాలు జరగకుండా చూడాలని ఆదేశించారు.

'బాలయేసు' విద్యార్థుల దాతృత్వం



విరాళం అందజేస్తున్న బాలయేసు విద్యార్థులు

దేవరుప్పుల: మండల కేంద్రంలోని బాలయేసు హైస్కూల్ విద్యార్థులు విరాళాలు సేకరించి పేదల అభ్యున్నతికి పాటుపడే నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనిటీ హార్మనీ సంస్థకు రూ.1,02,499 చెక్కును అందజేసి తమ దాతృత్వం నిరూపించుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలయేసు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు ఇటీవల యూనిఫైడ్ కౌన్సిల్ మ్యాథమటిక్స్ విభాగంలో జాతీయస్థాయిలో బి.అభిజ్ఞాన్, బి.సృజన్‌కు బంగారు పతకాలు పొందగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాపన్న ఆశయాలను కొనసాగించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామ రూరల్: పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



పాలకుర్తిటౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తదితరులు

సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని కలెక్టరేట్‌లో, జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న నేటి తరానికి ఆదర్శమని అన్నారు. వీరోచిత పోరాటంతో ఢిల్లీ సుల్తానుల ఆగడాలను ఎదిరించి బహుజనుల రాజ్యాన్ని స్థాపించిన విప్లవవీరుడు సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలన్నారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సమ్మయ్య, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, గౌడ జనహక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మూల వెంకటేశ్వర్లుగౌడ్, ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ పులి గణేష్‌గౌడ్, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

సన్న బియ్యంతో పేదలకు మరింత లబ్ధి



సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఏఎంసీ చైర్మన్



నర్మెట: బియ్యం పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



తరిగొప్పుల: సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్వేత



కొడకండ్ల: రామన్నగూడెంలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న సురేష్‌నాయక్

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ/జనగామ రూరల్: సన్న బియ్యం పంపిణీతో పేదలకు మరింత లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం జనగామ మండలం అడవికేశ్వాపూర్, జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ రేషన్ దుకాణాల్లో ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్‌తో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతీ నిరుపేదకు లాభం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని అమలు చేస్తోందన్నారు. సర్కారు అందిస్తున్న ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యం అత్యధిక పోషక విలువలు, విటమిన్లు కలిగి ఉంటాయన్నారు. తహసీల్దార్ హుస్సేన్, ఇన్‌చార్జ్ డీసీఎస్‌ఓ ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్, రేషన్ డీలర్లు ఎల్లయ్య, అబ్బాస్, డీటీ సీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడొద్దు

నర్మెట: ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా బడుగు బలహీన వర్గాలకు అందిస్తున్న ఉచిత సన్న బియ్యాన్ని డీలర్లు అర్హులందరికి అందించాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. మండలంలోని హన్మంతాపురంలో బుధవారం పంపిణీ కార్యక్రమాన్ని కొబ్బరికాయకొట్టి ప్రారంభించిన ఆయన మాట్లాడారు. పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కలకుంట్ల వెంకట రామానుజాచార్యులు, ఎంపీడీఓ బి. అరవింద్ చౌదరి, విజయలక్ష్మి, లక్ష్మయ్య, కృష్ణమూర్తి, రజిత, ఉమారాణి, బూలి, రాజబోయిన లక్ష్మీనారాయణ ఉన్నారు.

సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మకం

తరిగొప్పుల: తెల్ల రేషన్‌కార్డులు ఉన్న నిరుపేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేయాలనే ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమని చేర్యాల వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేతనాగరాజు అన్నారు. మండలంలోని నర్సాపూర్ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ నాగేశ్వరచారితో కలిసి ఆమె బుధవారం ప్రారంభించారు. జూనియర్ అసిస్టెంట్ రంగు శ్రీధర్, జోడుముంతల సత్యనారాయణ, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రవెల్లి సామెల్, డీలర్ గుంటి కిష్టయ్య, కాంగ్రెస్ నాయకులు విజయలక్ష్మి, రేష్మా, తరాల సమ్మయ్య, చిక్కొండ పోషయ్య, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

కొడకండ్ల మండలంలో..

కొడకండ్ల: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ అన్నారు. మండలంలోని రామన్నగూడెం, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సుధీర్, సోమన్న, రవిందర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే సన్న బియ్యం



మాట్లాడుతున్న రమేష్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్

జనగామ రూరల్: కేంద్రం నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాల అమలులో భాగంగా పేదలకు ఉచిత సన్న బియ్యం అందిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 10వేల కోట్ల రూపాయలు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వానికి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా గొప్పలు చెబుతోందని విమర్శించారు. ప్రతి రేషన్ షాపులో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటం పెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్‌యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పజూరి లక్ష్మీనరసయ్య, పార్లమెంట్ కోకన్వీనర్ శ్రీనివాస్, జగదీష్, హరీష్, కార్తీక్, సంతోష్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములకు వేలం వేయొద్దు



బచ్చన్నపేట: నిరసన తెలుపుతున్న నాయకులు

- సీపీఎం నాయకుల డిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/రఘునాథపల్లి/బచ్చన్నపేట/జఫర్‌గఢ్/పాలకుర్తిటౌన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూములు వేలం వేసే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం పలు మండల కేంద్రాల్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీ భూముల్లో బుల్డోజర్లు పెట్టి మూగజీవాల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. శాంతియుతంగా నిరసనలు తెలిపితే అరెస్టులు చేయడం సరికాదన్నారు. యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో రాపర్తి సోమయ్య, సుంచు విజేందర్, గంగాపురం మహేందర్, మునిగెల రమేష్, ఎండీ షబానా, సాదం రమేష్, గుండెబోయిన రాజు, బెల్లంకొండ వెంకటేష్, ఎల్లయ్య, కడారి ఐలయ్య, పొదల లవకుమార్, అంబాల మహేందర్, కొడెపాక యాకయ్య, కత్తుల రాజు, చిట్యాల సోమన్న, మాచర్ల సారయ్య, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్

- ఘన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ రవీందర్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ రవీందర్

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రాజీవ్ యువ వికాస్ పథకం దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కమిషనర్ జి.రవీందర్ అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి బుధవారం సూచనలు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లుకు చెందిన వారు కూడా మున్సిపాలిటీ కార్యాలయంలో సంబంధిత పత్రాలు అందజేయాలన్నారు.కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, సుమలత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

జనగామ రూరల్: అక్రమ అరెస్టులు సరికాదని ఎల్‌హెచ్‌పీఎస్, జీవీఎస్ నాయకులు అన్నారు. బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తు బుధవారం ఎల్‌హెచ్‌పీఎస్, జీవీఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడి నేపథ్యంలో పోలీసులు నాయకులను ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయా సమితిల మాట్లాడుతూ అక్రమ అరెస్టులకు భయపడమని, తమ జాతి కోసం పోరాటం చేస్తామని అన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షులు వాంకుడోత్ అనిత, జీవీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎదునూరి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో ప్రజలు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పెద్దల సహకారంతో తమవంతుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

జనగామ రూరల్: పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన తలపెట్టిన ధర్నాలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డితో పాటు జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

ఏడేళ్లకే నూరేళ్లు నిండాయా బిడ్డా..

- బాబాయ్ ఎంగేజ్‌మెంట్‌కు వచ్చి బాలుడి మృతి
- ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం



కొడుకును పట్టుకుని రోదిస్తున్న తల్లి

జనగామ రూరల్: కళ్లెదుటే ఆడుకుంటివి కదా.. అంతలోనే మమ్ములను విడిచి వెళ్లిపోయావా బిడ్డా అంటూ ఆ తల్లి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. బాబాయ్ ఎంగేజ్‌మెంట్‌లో బంధువులు, స్నేహితులతో ఆనందంగా గడిపిన బాలుడిని ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందిన విషాదకర ఘటన మండలంలోని పెద్దపహాడ్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపహాడ్ గ్రామానికి చెందిన పల్లేపు సంపత్-మౌనిక దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఉగాది పండుగ, అలాగే బాబాయ్ ఎంగేజ్‌మెంట్ కోసం పిల్లలతో కలిసి స్వగ్రామానికి వచ్చారు. కాగా, బుధవారం ఎంగేజ్‌మెంట్ పనుల్లో అందరూ ఉండగా ఇంటిపక్కనే ఉన్న సిమెంట్ బెంచ్‌పై పెద్ద కుమారుడు దేవ్విక్(7) కూర్చోగా గ్రామానికి చెందిన ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో వెనుక టైర్ కింద దేవ్విక్ పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు ఇంట్లో ఉండి ఆడుకుంటూ కొద్ది సమయంలో ట్రాక్టర్ రూపంలో మృత్యువు ఒడికి చేరడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



కవిత మృతదేహం

నర్మెట: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినది. పోలీసులు తెలిపిన వివరాలు.. వెల్దండకు చెందిన ఆసిరెడ్డి కవిత (40) భర్త శ్రీనివాస్ రెడ్డి మద్యానికి బానిస కావడంతో కుటుంబ కలహాలతో విసుగు చెంది తమ వ్యవసాయ బావివద్ద సోమవారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు. కాగా, మృతురాలి తండ్రి ప్రతాప్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేర కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

చైతన్య యాత్రకు తరలిరావాలి



మాట్లాడుతున్న యాకయ్య

పాలకుర్తి: తెలంగాణ సాధన మలి దశ ఉద్యమ నాయకులకు ఇంటి స్థలాల ఇవ్వాలని కోరుతూ ఉమ్మడి జిల్లా స్థాయిలో ఈ నెల 4వ తేదీన చేపట్టనున్న చైతన్య యాత్రకు అధిక సంఖ్యలో తరలిరావాలనిఉద్యమ ఫోరం జిల్లా అధ్యక్షుడు మొలుగూరు యాకయ్య పిలుపునిచ్చారు. బుధవారం పాలకుర్తిలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ కారులకు 250 గజాల స్థలం ఇవ్వాలని కోరుతూ నిర్వహిస్తున్న యాత్రను విజయవంతం చేయాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు నల్లమాస రమేశ్, కొండ వెంకన్న, నర్సింహారెడ్డి, సంఘి వెంకన్న, ఎడవెల్లి దండయ్య, అంజిరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఉత్సవాల తేదీల ఖరారు



దుర్గామాత ఉత్సవాల లగ్నపత్రికను స్వీకరిస్తున్న గ్రామ పెద్దలు

రఘునాథపల్లి: రఘునాథపల్లి మండల కేంద్రంలో మే 4 నుంచి 8వ తేదీ వరకు దుర్గామాత ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామస్తులు తేదీలు ఖరారు చేశారు. బుధవారం గ్రామ పెద్దలు, కుల పెద్దలు సమావేశమై ఉత్సవాల విజయవంతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా పూజారులచే దుర్గామాత ఉత్సవాల లగ్నపత్రికను గ్రామ పెద్దలు స్వీకరించి ఉత్సవాల వివరాలు వెలడించారు. మే 4వ తేదీన బొడ్రాయికి జలాభిషేకం, గ్రామ దేవతలకు పూజలు, సాయంత్రం పోచమ్మ, ముత్యాలమ్మ దేవతలకు బోనాలు, 5న శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లికి పుట్ట కమ్మడం, 6న శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని కల్యాణం, 7న ఉదయం గద్దె వేయుట, రాత్రి దుర్గామాతకు బోనాలు, 8వ తేదీన ఉదయం గావు పట్టి యాటలు బలివ్వడంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

కుక్కల దాడిలో పందెం కోళ్ల మృత్యువాత



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాల గ్రామంలో గుండె యాదయ్య అనే రైతుకు చెందిన పది పందెం కోళ్లు కుక్కల దాడిలో మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదయ్య తన వ్యవసాయ భూమి వద్ద పందెం కోళ్లను పెంచుకుంటున్నాడు. ప్రతీ ఏడాది సంక్రాంతి ముందు వాటిని హన్మకొండ, వరంగల్ పట్టణాలకు చెందిన వారికి ఒక్కొక్క పుంజును రూ.4వేల నుంచి రూ.8వేల వరకు విక్రయిస్తుంటాడు. కాగా, రోజు మాదిరిగానే తన వ్యవసాయ భూమి వద్ద ఉన్న పందెం కోళ్లపై బుధవారం ఉదయం ఊరకుక్కలు దాడి చేయడంతో పది కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటనతో దాదాపు రూ.40వేల వరకు నష్టపోయినట్లు బాధితరైతు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వారం రోజుల క్రితం లేగదూడపై, కోళ్లపై దాడి చేయగా ఆరు కోళ్ళు మృతిచెందినట్లు తెలిపారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించాలని, కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాడు.